క్లుప్తంగా

విశ్వకర్మ ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



చెక్కును అందజేస్తున్న భాస్కర్‌రావు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మండలవీధికి చెందిన రాయల భాస్కరరావు తన భార్య సావిత్రమ్మ జ్ఞాపకార్థం హైదరాబాద్‌లోని విశ్వకర్మ ఆలయ నిర్మాణం కోసం రూ.2 లక్షల విరాళాన్ని ఆదివారం అందించారు. హైదరాబాద్ బోరబండ ప్రాంతంలోని మల్లన్న గుడి ఏరియా వద్ద నిర్మాణం అవుతున్న ఆలయానికి గాయత్రీ విశ్వకర్మ భగవాన్ ఆలయ కమిటీ సభ్యులు పోరపాక పెద్ద మల్లేశ్వరరావు ఆచారికి శ్రీకాకుళంలోని భాస్కరరావు ఇంటివద్ద సంబంధిత చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ సుమారు రు.2 కోట్ల వ్యయంతో ఆలయ నిర్మాణం చేపట్టామని, ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆర్థికంగా చేయుతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో వావిలపల్లి సూర్యనారాయణ, రాబల్లి రామలింగం ఆచారి పాల్గొన్నారు.

విశిష్టమైనది కనకధారా స్తోత్రం



శర్మను సన్మానిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ఎంతో విశిష్టమైనది కనకధారా స్తోత్రమని ప్రముఖ అవధాని రంప సాయికుమార్ శర్మ అన్నారు. స్థానిక ఉపనిషత్ మందిరంలో కనకధారా స్తోత్రంపై ఆదివారం ఉపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రచించిన ఈ స్తోత్రం ప్రతి ఒక్కరూ చదివితే సిరిసంపదలు లభిస్తాయన్నారు. ముందుగా వి.సాయికుమార్ శర్మను మందిరం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మందిరం ఉపాధ్యక్షులు పతంజలి శాస్త్రి నరసింహమూర్తి, బాబూరావు, కోమల్‌రావు పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ



గ్రంథాలయానికి అందజేసిన కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న షణ్ముఖరావు

రణస్థలం: జే.ఆర్.పురంలోని ఇదదాసుల విద్యా ఆరోగ్య సేవా ఫౌండేషన్ గ్రంథాలయానికి ఆంధ్రా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగి జినగం షణ్ముఖరావు కంప్యూటర్‌ను ఆదివారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు తిరుపతిరాజు మాట్లాడుతూ 2007 నుంచి 2011 వరకు రణస్థలం ఆంధ్రా బ్యాంక్‌లో సేవలందించి రిటైర్ అయిన షణ్ముఖరావు ఆయన అన్నయ్య శంకరరావు పేరుతో కంప్యూటర్ వితరణగా ఇచ్చారన్నారు. సేవా సంస్థ సభ్యులు దేశెట్టి హరిప్రసాద్, మింద్రాన రామారావు, తాజియిద్దీన్, ముల్లు రాంబాబు, పసుపురెడ్డి సురేష్, కొమ్మోజు ఉమ, గెద్దపు వరం, ఖండవిల్లి వెంకటేష్, బలివాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



కథల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

లావేరు: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని లావేరు గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లావేరు గ్రామంలో గల శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మా కిష్టం అనే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు కథలు చదవడంపై పోటీలు నిర్వహించారు. బాగా చదివిన ముగ్గురు విద్యార్థులకు గ్రంథాలయాధికారి బహుమతులు అందజేశారు. గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

కవిటి: లండారపుట్టుగ పంచాయతీ కొత్తపుట్టుగ గ్రామానికి చెందిన నర్సు జయమ్మ కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. ప్రస్తుతం శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న అబ్దుల్ కలాం ఫౌండేషన్ సంస్థ ఉదారంగా స్పందించింది. బాధితురాలి ఇంటికి ఆదివారం వెళ్లి తమ సంస్థ తరఫున వైద్యఖర్చుల కోసం పది వేల రూపాయలను అందించి మానవత్వాన్ని చాటుకన్నారు. ఆపదలో ఉన్న తమ కుటుంబం చూపిన అభిమానానికి బాధితురాలి భర్త గున్నయ్య కృతజ్ఞతలు తెలిలియజేశారు. కార్యక్రమంలో బల్ల కాంతారావు మాస్టారు పాల్గొన్నారు.

'స్థానిక' ఉపపోరులో..

వైఎస్సార్‌సీపీ హోరు

పలు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల స్థానాలకు శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులే విజయకేతనం ఎగురవేశారు. ఏకగ్రీవాలు, ఎన్నిక జరిగిన అన్నిస్థానాల్లో పార్టీ మద్దతు ఇచ్చినవారే విజేతలుగా నిలిచారు. ప్రతిపక్ష టీడీపీ మద్దతుతో అభ్యర్థులు కనీసం పోటీ చేయదానికి కూడా సాహసం చేయలేదు. తాజా విజయంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆనందంలో ఉన్నాయి.

● లావేరులో..

లావేరు: మండలంలోని సహపురం పంచాయతీ 3వ వార్డు మెంబరుగా వైఎస్సార్ సీపీ మద్దతుదారు ఎం.పార్వతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 19వ తేదీన ఉప ఎన్నిక నిర్వహించారు. ఒక్క నామినేషన్ వేయడంతో పార్వతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.



పార్వతి, సహపురం, 3వ వార్డు, లావేరు (ఏకగ్రీవ్రం)

● రణస్థలంలో ..



గుంటు బుల్లెమ్మ, అల్లివలస



మాగుపల్లి యర్రమ్మ, అల్లివలస

రణస్థలం: మండలంలోని రెండు పంచాయతీలో జరిగిన పంచాయతీ ఉప ఎన్నిక మూడు వార్డు మెంబర్లు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అల్లివలస మూడో వార్డు, ఐదో వార్డు సభ్యురాలు గుంటు బుల్లెమ్మ, మాగుపల్లి యర్రమ్మ, చిల్లపేటరాజాం పంచాయతీలో గల 6వ వార్డులో కేతు తవిటమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



కేతు తవిటమ్మ, చిల్లపేటరాజాం

● ఎచ్చెర్లలో..

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు వార్డు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమ్మినాయుడుపేట పంచాయతీలో 1వ వార్డు సభ్యురాలిగా యండ స్వాతి ఏకగ్రీవంగా కాగా.. ఉప సర్పంచ్‌గా ఈమెకు అవకాశం దక్కింది. అజ్జరాంలో 1వ వార్డు సభ్యురాలిగా బోర సూర్య కుమారి ఎన్నికయ్యారు.



యండ స్వాతి, తమ్మినాయుడుపేట,



బి: బోర సూర్యకుమారి, అజ్జరాం

గార మండలంలో ఐదు..



బర్రి నీరేఖరి (కొమరవానిపేట)



జన్నాడ రమణమ్మ (అంబళ్లవలస)



ఆరంగి ఉషారాణి (కె. సైరిగాం)



దాసరి కాంతమ్మ (కె. మత్స్యలేశం)



వాసుపల్లి ఎల్లాయమ్మ (బలరాంపురం)

గార: మండలంలో ఐదు పంచాయతీ వార్డు స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. కొమరవానిపేట పంచాయతీ ఒకటో వార్డు నుంచి బర్రి నీరేఖరి, అంబళ్లవలస మూడో వార్డు జన్నాడ రమణమ్మ, కె.సైరిగాం నాలుగో వార్డు ఆరంగి ఉషారాణి, కె.మత్స్యలేశం ఒకటో వార్డు దాసరి కాంతమ్మ, బలరాంపురం నాలుగో వార్డు వాసుపల్లి యల్లాయమ్మ ఏకగ్రీవంగా వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థులుగా ఎన్నికయ్యారు.

పంచాయతీ ఉప ఎన్నికల్లో

వైఎస్సార్‌సీపీ జోరు

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: రాష్ట్రంలో ఏ ఎన్నికలైనా వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని, అందుకు పంచాయతీ ఉప ఎన్నికలే నిదర్శనమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబు నియోజవకర్గం కుప్పంలో ఆరు వార్డుల్లో ఎన్నికలు జరగగా ఐదు వార్డుల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారన్నారు. టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గం చలివెందుల పంచాయతీలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు ఉపేంద్ర రెడ్డి ఘన విజయ సాధించారని, తాడిపత్రి నియోజకవర్గంలో జేసీ సోదరుల సొంత మండలంలో పెద్దపప్పూరులో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు గెలిపొందారన్నారు. ప్రతిపక్షం ప్రధాన నాయకుల అడ్డాలో కూడా వైఎస్సార్‌సీపీ విజయం సాధించిందన్నారు.

పంచాయతీ, మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కార్పొరేషన్ ఎన్నికలు ఏవైనా వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గాలి ముందు ఇతర పార్టీలు నిలవలేవన్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులకు ప్రజలు మద్దతిస్తున్నారన్నారు. చంద్రబాబు కుటీల రాజకీయాలకు, దత్తపుత్రుడు నిలకడలేని, విలువలు లేని మాటలకు, లోకేష్ పాదయాత్రతో ప్రజలకు ఒరిగిందేమిటి లేదనే విషయం స్పష్టంగా తెలుస్తోందన్నారు. 2024లోనూ 2019 ఫలితాలు పునారావృతం కావడం ఖాయమన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి

● ఆస్పత్రి ప్రారంభంలో కేంద్ర మాజీమంత్రి కృపారాణి

శ్రీకాకుళం: అధునాతన సౌకర్యాలతో.. మెరుగైన వైద్య సేవలు అందించాలని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి అన్నారు. పట్టణంలో డాక్టర్ లక్ష్మీనారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్రీకాకుళం పట్టణంలో అందరికీ అందుబాటులో న్యూరో, డెంటల్ కేర్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. ఇకపై దూర ప్రాంతాలకు న్యూరో వైద్యం కోసం వెళ్లవలసిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నిమ్స్‌తో పాటు ప్రముఖ ఆస్పత్రుల్లో న్యూరో వైద్యునిగా డాక్టర్ లక్ష్మీనారాయణకు ఎంతో మంచి పేరు ఉందని అన్నారు. అటువంటి అనుభవమైన వ్యక్తి పట్టణంలో ఆస్పత్రి ఏర్పాటు చేయడం ఎంతో మంచి ఆలోచనగా చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి, వైఎస్సార్‌సీపీ యువ నేత ధర్మాన కృష్ణచైతన్య, ప్రముఖ వైద్య నిపుణులు గూడేన సోమేశ్వరరావు, మందుల మోహనరావు, వజ్జ బాలరాజు, జర్నలిస్టు సంఘం రాష్ట్ర నేత కొంక్యాన వేణుగోపాల్, డాక్టర్ బాణ్ణ త్రినాథరావు, ఆస్పత్రి అధినేతలు పైల లక్ష్మీనారాయణ, పేడాడ ఇందిర పాల్గొన్నారు.

● ఎన్నాళ్లకెన్నాళ్లకు..



వివాహ వేడుకల్లో పాత రీతులు మళ్లీ కనిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన ఓ వివాహ వేడుకలో వధూవరులను ఇలా గుర్రపు బగ్గీపై ఊరేగించారు. చాలాకాలం తర్వాత గుర్రపు బగ్గీ కనిపించడంతో స్థానికులు ఆసక్తిగా గమనించారు. - శ్రీకాకుళం

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



గ్రామ సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

● ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల ప్రగతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. కుశాలపురంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.40 లక్షలతో నిర్మాణం చేపట్టిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో గతంలో ఎన్నడూలేని విధంగా ప్రభుత్వ భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ భవనాలు ఇలా అవసరమైన భవనాలు నిర్మిస్తున్నామన్నారు. ప్రజలు వద్దకు ప్రభుత్వ సేవలు అందించడమే లక్ష్యంగా గ్రామ స్థాయిలో కార్యాలయాలు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి నిరంతరం పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణ రావు, పంచాయతీరాజ్ డీఈ సీతన్నాయుడు, ఏఈ సూర్యచంద్రరావు, స్థానిక నాయకులు పైడి త్రిమూర్తులు, సీహెచ్ కృష్ణమూర్తి, పైడి మురళి, చందు, శ్రీనివాసరావు, కొత్తకోట సూర్యారావు పాల్గొన్నారు.

శరవేగంగా ఇంటింటా ఓటర్ సర్వే

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఇంటింటా ఓటర్ సర్వే శరవేగంగా సాగుతోందని ఎన్నికల ఉప తహసీల్దార్ జి.కె.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని రణస్థలంలో ఇంటింటా ఓటర్ సర్వేను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నాటికి నియోజకవర్గం వ్యాప్తంగా 93 శాతం పూర్తి చేశామని చెప్పారు. ఎచ్చెర్ల మండలంలోని ఓటర్లు 71,402 ఓట్లు ఉండగా 65001 మంది ఓట్లు సర్వే పూర్తిచేయడం జరిగిందన్నారు. లావేరులో 53,140 మంది ఓటర్లకు 48,432, జి. సిగడాంలో 45,041 మంది ఓటర్లకు 41,744, రణస్థలంలో 66,056 మంది ఓటర్లుకు 65,208 మంది ఓట్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశామన్నారు. అన్ని పార్టీల నాయకుల సమక్షంలో ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపు ప్రక్రియ చేపట్టామన్నారు.



రణస్థలంలో ఇంటింటా ఓటర్ సర్వే చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్

చిన్నారులకు బాలరామాయణం పోటీలు



విజేతలతో నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు బాలరామాయణంపై ఆదివారం పోటీలు జరిగాయి. పిల్లలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. సుధాన్వ సాయి, బి.పరిమళ సమృద్ధి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరికి నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, నిక్కు హరిసత్యన్నారాయణ, ప్రసాద్, ఎల్.దీప్తి పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

శ్రీకాకుళం కల్చరల్: మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జెమ్స్ ఆస్పత్రి వైద్యులచే మెండేటివీధిలోని షిర్డీసాయి బాబా మందిరం వద్ద ఉదయం తొమ్మిది గంటల నుంచి శిబిరం కొనసాగుతోందన్నారు.

ఆలయ సింహద్వారం నిర్మాణం



శంకుస్థాపన కోసం పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణ గ్రామ దేవత పాలపోలమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే సింహద్వారం నిర్మాణానికి ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కూన బాలకృష్ణ దంపతులతో వేద పండితులు ప్రసాద్‌శర్మ, రాజేష్‌శర్మలు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సింహద్వారం నిర్మాణానికి సీ.ఎం.ఆర్ నుంచి రూ.15 లక్షల నుంచి రూ.20లక్షల వరకు విరాళం అందజేస్తున్నట్లు వారు ప్రకటించారని తెలిపారు. అలాగే అమ్మవారికి బంగారు కిరీటం చేయించేందుకు స్పీకర్ సతీమణి తమ్మినేని వాణీ సీతారాం రూ.లక్ష విరాళంగా అందజేశారన్నారు. ఆలయ ప్రాంగణంలో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలు ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ రూ.2 లక్షలు విరాళంగా అందించారని తెలిపారు.

చిన్నారి వైద్యానికి..



చిన్నారికి సాయాన్ని అందజేస్తున్న సంఘ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన చిన్నారి యాంద్రాపు ఆధ్య హెచ్ఎల్‌హెచ్ అనే వ్యాధితో బాధపడుతూ చికిత్సలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న కేశుపురం గ్రామానికి చెందిన కాళీమాత సేవా సమితి స్పందించి పాతిక వేల రూపాయలను సమకూర్చింది. ఈ మొత్తాన్ని సమితి సభ్యులు ఆదివారం విశాఖలోని ఆస్పత్రికి వెళ్లి చిన్నారికి అందజేసి వైద్యం కోసం ఖర్చు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు మర్ల శ్రీను, సూరు పురుషోత్తం, సత్యన్నారాయణ, పిలక భాస్కర్ పాల్గొన్నారు.

రాయితీపై ఎరువుల పంపిణీ



ఎరువులు పంపిణీ చేస్తున్న వెంకటిసాయి

జి.సిగడాం: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటి సాయి అన్నారు. మండలంలోని ఆనందపురం గ్రామంలో రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు రాయితీపై ఎరువులను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం వేలాది రూపాయిలు వెచ్చించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఖరీఫ్ సమయంలో రైతులు పెట్టుబడుల కోసం కష్టాలు పడకుండా ఉండేందుకు రైతు భరోసా పథకం నిధులు మంజూరు చేశారన్నారు. సర్పంచ్ చిత్తిరి మంజు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్తిరి మోహన్, మక్క సాయితేజ అగ్రికల్చర్ అసిస్టెంట్ ముంతా హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులను అరికట్టేందుకు చర్యలు



మాట్లాడుతున్న బొడ్డేపల్లి మోహన్‌రావు

ఆమదాలవలస: న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్లు, దీన్ని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) 12వ రాష్ట్ర మహాసభ తీర్మానించిందని ఐలు రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి మోహన్‌రావు అన్నారు. స్థానిక సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఆదివారం న్యాయవాదులతో సమావేశమై ఈ విషయాన్ని వెల్లడించారు. న్యాయవాదులపై దాడులు నివారించాలని రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. సుప్రీంకోర్టు, హైకోర్టులలో న్యాయమూర్తుల నియామకంలో సామాజిక న్యాయం పాటించాలన్నారు. దక్షిణాదిలో సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కోర్టులలో మహిళా న్యాయవాదులు, కక్షిదారులకు కనీస సౌకర్యాలు కలిప్పించాలన్నారు. న్యాయవాదుల సంక్షేమ నిధిని ప్రభుత్వం విడుదల చేయాలని జూనియర్ లాయర్లకు స్టైఫండ్ క్రమం తప్పకుండా అందజేయాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మిభాయ్, సీనియర్ న్యాయవాదులు హనుమంతు ప్రసాదరావు, బి.సీతారాం, గురుగుబెల్లి ప్రభాకరరావు, రాజేశ్వరరావు, తమ్మినేని అన్నంనాయుడు, కె.త్రినాథరావు, సీపాన గోవిందరావు, బొనిగి రమణ, అల్లాడ విజయ్ కుమార్, ప్రసాదరావు, హనుమంతు అచ్చెన్నాయుడు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో పుస్తకావిష్కరణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలకు చెందిన ప్రొఫెసర్ జి.వాసంతి రచించిన 'కాన్సెప్ట్ ఆఫ్ ఇంజినీరింగ్ మేథమెటిక్స్' అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపయోగకరంగా ఉండే విధంగా పుస్తకాలను రచించాలన్నారు.